నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

శనివారం | ఫిబ్రవరి 01, 2025 | www.navatelangana.com

కొడుకు అదృశ్యం

- చదువుకోమని తల్లి మందలించినందుకు



రాహుల్ (ఫైల్)

నవతెలంగాణ-జుక్కల్

పాఠశాల నుంచి తిరిగి వచ్చిన కొడుకును తల్లి చదువుకోమని మందలించినందుకు గురువారం కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయి అదృశ్యం అయినా సంఘటన మండలంలోని చెండే గావ్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై భువనేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. చెండేగావ్ గ్రామానికి చెందిన బాలుడు రాహుల్ (11) సోమూర్ విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన ఉన్న మౌంటెన్ స్కూల్లో నాలుగవ తరగతి చదువుకుంటున్నాడు. స్కూల్ నుంచి తిరిగి వచ్చిన కొడుకు ఎప్పుడు ఆటలాడుకుంటూ జులాయిగా మిత్రులతో తిరుగుతూ ఉంటాడాని తల్లి చదువుకోమని మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లి టోంపే రమాబాయి హాలో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్



నవతెలంగాణ-మాక్లూర్

ఆలూర్ మండలంలోని కల్లెడ గ్రామంలోని ఆర్ఎంపీ క్లినిక్‌ను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంజన శుక్రవారం సీజ్ చేశారు. కల్లెడ గ్రామానికి చెందిన ఆయేషా అనుమానాస్పదంగా ఇటీవలే మృతిచెందింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.అంజన కల్లెడ గ్రామాన్ని సందర్శించారు. మృతి చెందిన అయేషా ఇంటికి వెళ్లి.. ఆమె కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు సేకరించారు. అదేవిధంగా మృతురాలికి ట్రీట్మెంట్ చేసిన ఆర్ఎంపీ సునీల్ వర్మకు చెందిన ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను టెంపరరీగా సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, ప్రవీణ్ రెడ్డి, ప్రసాద్, గ్రామ కార్యదర్శి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

అణగారినవర్గాల ఆశాజ్యోతి గద్దర్

- గుండెల్లో తూటాలు దించినా.. పేదలకై పోరాటాలు నడిపారు
- ఆయన ఆశించిన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- అదే ఆయనకిచ్చే ఘన నివాళి
- గద్దర్ ఫౌండేషన్ అధ్యక్షులు గైని గంగారం



నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి గద్దర్ అని, ఆయన ఆశించిన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని గద్దర్ ఫౌండేషన్ అధ్యక్షులు గైని గంగారం అన్నారు. శుక్రవారం నగరంలోని మల్లు స్వరాజ్యం ట్రస్టు భవన్‌లో జరిగిన గద్దర్ 76వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గద్దర్ జయంతికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పరిరక్షణ కోసం గద్దర్ ఎంతో కృషి చేశారని, ఆర్ఎస్ఎస్, బిజేపీ రాజ్యాంగ స్థానంలో మనుస్మృతిని తీసుకు రావాలని ప్రయత్నం చేస్తున్నారని, కులం మతం పేరున ప్రజల మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తున్నారని, దానిని గుర్తించి ప్రజల్ని చైతన్య పరచాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు అన్నారు. గద్దర్ చనిపోకపోతే ఈ అవార్డులు, పద్మశ్రీలను తృణప్రాయంగా తిరస్కరించేవాడని ఆయన వాపోయారు. దళితులు, పేద ప్రజలందరూ ఐక్యంగా సమసమాజ స్థాపన కోసం, ప్రజలందరికీ తోడ్పాటు అందించేందుకు గద్దర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు బీసీ ఉద్యోగుల నాయకులు కరిపే రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో శక్కి విజయ్, షేక్ హుస్సేన్, బంగారు సాయిలు, రామ్మోహన్‌రావు, నీరడి లక్ష్మణ్, జేఏసీ భాస్కర్, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అష్టగంగాధర్, గోదావరి, తదితరులు పాడిన పాటలు అందరినీ అలరించాయి.

తప్పిదాలు జరిగితే చర్యలు

- ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- సుద్దపల్లి రెసిడెన్షియల్ స్కూల్, సుద్దులం జెడ్పీహైస్కూల్ సందర్శన



అన్నం నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్త తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలంలోని సుద్ద పల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను, సుద్దులంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. సుద్దపల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో కిచెన్, డార్మెటరీ, డైనింగ్ హాల్‌లను పరిశీలించి సదుపాయాలను గమ నించారు. బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. కూరగాయలు సక్రమంగా భద్రపర్చకపోవడాన్ని గమనించిన కలెక్టర్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. సుద్దులం జెడ్పీ హైస్కూల్‌లో తాగు నీటి వసతి, కిచెన్ షెడ్, టాయిలెట్స్, క్రీడామైదానం తదితర వాటిని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులు అందాయా? అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలు అసంపూర్తిగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే వాటి నిర్మాణాలను పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పదవ తరగతి క్లాస్ రూమ్‌కు వెళ్లి విద్యార్థులకు గ్రాండ్‌టెస్ట్ పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. గతేడాది టెన్త్‌లో వచ్చిన ఫలితాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది నూటికి నూరుశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అందజేసే భోజనంలో ఎలాంటి తప్పులు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ ప్రభాకర్, అధికారులు, ప్రిన్సిపాల్ నళిని, అధ్యాపకులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్..

జక్రాన్‌పల్లి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నందున, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు. పీహెచ్‌సిలోని ఇన్ పేషంట్ వార్డ్, ల్యాబ్, టీకాలు ఇచ్చే గది, ఔషధాలను నిలువ ఉంచిన డ్రగ్ స్టోర్ తదితర విభాగాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి, అందుబాటులో లేని వారి గురించి ఆరా తీశారు. వైద్య సేవల కోసం పీహెచ్‌సికి వచ్చిన రోగులను పలకరించి, వారికి అందుతున్న వైద్య సేవల తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య పరికరాలను పరిశీలించి, సీబీపీ మెషిన్ వినియోగంలో ఉందా అని సిబ్బందిని ఆరా తీశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, కాలం చెల్లిన ఔషధాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వాటి స్థానంలో కొత్త స్టాక్‌ను వినియోగించాలని కలెక్టర్ సూచించారు.

ఇద్దరి బైండోవర్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గండివేట్ తండాలో కల్తీ సారా అమ్ముతూ పట్టుబడిన తండాకు చెందిన రామావత్ దొలి, విస్లావత్ సోమ్లాను ఆబ్కారీ సీఐ షాకీర్ అహ్మద్ గాంధారి తహసీల్దార్ సతీష్‌రెడ్డి వద్ద బైండోవర్ చేశారు. ఈ బైండోవర్‌ను రెండు సంవత్సరాల కాలంలో ఉల్లంఘిస్తే రూ.2,00,000 లేదా ఒక సంవత్సరం జైలుశిక్ష విధించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రజిత, స్రవంతి, పెంటయ్య, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

ఢిల్లీలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరికి మద్దతుగా శుక్రవారం ఎన్నికల ప్రచారంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతుందని వివరించారు. ఎమ్మెల్యే వెంట మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, డోంగ్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రాజు పటేల్ పాల్గొన్నారు.

జానకంపేట్, తానాకలాన్ శివారులో పులి సంచారం



చిరుత పాదముద్రలను గుర్తిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట, తానాకలాన్ శివారులో పులి సంచరిస్తున్నట్టు తెలుస్తోంది. పులి సంచరించిన ఆనవాళ్లను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఇదిలా ఉండగా ఈ నెల 5న జానకంపేట్ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పులి సంచారంతో జాతరకు వచ్చే ప్రజల్లో భయం నెలకొంది.

డ్రైనేజీ నిర్మాణం చేపట్టేనా..?



రోడ్డుపై పారుతున్న మురికినీరు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని బీడీ కార్మిక కాలనీలో రోడ్డుపై మురికి నీరు పారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ సర్కిల్ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారిలో డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో ఇండ్ల నుంచి వచ్చే మురికి నీరు రోడ్డుపై పారుతోంది. విద్యుత్ సరఫరా కూడా లేకపోవడంతో రాత్రి సమయంలో ఈ రోడ్డు నుంచి వెళ్లే వారు రాత్రి సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి సైన్స్ టాలెంట్



విద్యార్థులకు బహుమతులు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షను నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 25 మంది విద్యార్థులు హాజరై సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారి శ్రీనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, మూఢనమ్మకాలను వీడనాడాలని, నిత్యజీవిత సవాళ్లను ఎదుర్కోవడంలో సైన్స్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. విజేతలుగా నిలిచిన కావేరి, సుమధీర్, మహేష్, అభి, అర్చన, స్రవంతిని జ్ఞాపికలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి దేవేందర్, సైన్స్ ఉపాధ్యాయులు రాజు, మహేష్‌కుమార్, బాల్త రాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో కామారెడ్డి జిల్లాకు

అధిక నిధులు కేటాయించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఫిబ్రవరి 1 నుంచి జరగనున్న కేంద్ర బడ్జెట్ సమావేశాలలో వెనుకబడిన కామారెడ్డి జిల్లాను నిర్లక్ష్యం చేయకూడదని, కేంద్ర బడ్జెట్లో కామారెడ్డి జిల్లాకు అధిక నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం కామారెడ్డి జిల్లాకు ఎలాంటి సహకారం చేయలేదని, అయినా జిల్లా ప్రజలు పెద్ద మనసుతో బీజేపీకి ఒక ఎమ్మెల్యే సీటు గెలిపించి ఇచ్చారని, ఇప్పుడైనా కామారెడ్డి జిల్లాను జిల్లాలోని ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం జిల్లాకు అవసరమైన వసతుల సౌకర్యం కోసం బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా కామారెడ్డి టు హైదరాబాద్ వెళ్లే రైలు ప్రయాణికులకు సింగిల్ వే ఉండడం వల్ల ఇబ్బందులు అవుతున్నాయని, మన్మాడ్ టు సికింద్రాబాద్ వరకు డబుల్ లైన్ కోసం నిధులు కేటాయించాలని అన్నారు. వెనుకబడ్డ బాన్సువాడ, జుక్కల్ ప్రాంతంలో సరైన రవాణా సౌకర్యం లేక జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బంది అవుతున్నందున కామారెడ్డి బాన్సువాడ జుక్కల్ మీదుగా కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని దానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో, పాత రాజంపేట్ రైల్వే గేట్ ఈ రెండు రైల్వే గేట్ల వద్ద ప్రజలు గంటల తరబడి నిలబడాల్సి వస్తుందని, రెండు రైల్వే గేట్‌ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేసి నిధులు కేటాయించాలన్నారు. టాక్స్ పేర్ల సమస్యలు ఏవైతే ఉన్నాయో వాటిని పరిష్కరించి మధ్యతరగతి ప్రజల మీద ఒత్తిడిని తగ్గించాలని, ఇన్కమ్ టాక్స్ లిమిట్స్‌ను 15 లక్షలకు పెంచాలని హోమ్‌లోన్స్‌పై అయిదు లక్షల వరకు ఇవ్వాలని అన్నారు. వీటితోపాటు కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులకు యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగ హామీని నిలబెట్టుకునే దాంట్లో భాగంగా ఉప్పల్వాయి వద్ద గల గోదాముల దగ్గర వ్యాగన్ వర్క్ షాప్‌ను మంజూరు చేసి దానికి నిధులు కేటాయించాలన్నారు. దీని ద్వారా జిల్లాలోని యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలియజేశారు. ఇందుకుగానూ బిజెపి జిల్లా పార్టీ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్‌గౌడ్, మోతీరాం నాయక్, కొత్త నరసింహులు, ముదాం అరుణ్ కుమార్, సురేష్ గొండా తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-దోమకొండ

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంత రెడ్డి, మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్ అన్నారు. దోమకొండతో పాటు బిబిపేట్, భిక్కనూర్, మాచారెడ్డి మండలాలకు అదనంగా 132/11 లైన్లు మంజూరు చేయించడం అభినందనీయమని వారు తెలిపారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డి మండలంలోని సరంపల్లి గ్రామంలోని 220 కెవి సబ్‌స్టేషన్ నుంచి గతంలో దోమకొండ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌కు 132/11 కెవి ద్వారా 132 విద్యుత్ సరఫరా అయ్యేదని.. ప్రస్తుత అవసరాల రీత్యా కరెంటు ఎక్కువ అవసరం ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ దృష్టికి కాంగ్రెస్ పార్టీ నాయకులు తీసుకువెళ్లగా ఆయన స్పందించి, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి అదనంగా 132 విద్యుత్‌లైన్ సరఫరా చేయించాడని వారు వివరించారు. దీంతో ఈ ప్రాథమిక కాకుండా 132 విద్యుత్ అదనపు లైనుతో 20 సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సమస్య ఉండబోదని కాంగ్రెస్ నాయకులు వివరించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీకి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, సంతోష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పూలబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను బెదిరిస్తే సహించేది లేదు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలకు కాంగ్రెస్ నాయకులు ఫోన్లు చేసి బెదిరిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దివిటి రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన గ్రామ సభలో సంక్షేమ కార్యక్రమాలపై ప్రశ్నించిన బిఆర్ఎస్ కార్యకర్తలకు కాంగ్రెస్ నాయకులు ఫోన్‌చేసి బెదిరిస్తున్నారని అన్నారు. అలాగే సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులకు సైతం అడ్డగోలుగా బెదిరిస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదన్నారు. రాజకీయాలు చేయాలి కానీ దిగజారిన రాజకీయాలు మానుకోవాలన్నారు. ప్రశ్నించిన బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనా యిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా ఇలాంటి నీతిమాలిన రాజకీయాలు మానుకోవాలన్నారు. మండల అధ్యక్షుడు దివిటి రమేష్, తాజా మాజీ సర్పంచ్ నరసింహులు, రవీందర్, లక్ష్మణ్, శ్రీకాంత్, గంగారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సాయిరాం, పరంధాములు, పరువయ్య తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తిలో అంగన్వాడీ సెక్టార్ సమావేశం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలో సెక్టర్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులతోపాటు, గర్భిణీ బాలింత మహిళలకు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన రికార్డులన్నీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. చిన్నారులకు బరువులు, ఎత్తుల ప్రకారం వారికి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. గర్భిణీ బాలింత మహిళలకు ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఆకుకూరలు కాయగూరల లను సాగు చేయాలన్నారు.

రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతీ రైతు సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ నాగరాణి తెలిపారు. శుక్రవారం భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. రైతులకు అసైన్మెంట్ భూములు, విత్తనాలు, విద్యుత్, మార్కెట్ వంటి చట్టాలను వివరించారు. రైతు విత్తనం కొనుగోలు మొదలు పంటను మార్కెట్లో అమ్ముకునే వరకు ఎదురయ్యే న్యాయ పరమైన సమస్యలను అగ్రిలీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు న్యాయంగా రైతులకు అందేలా చూడాలని అధికారుకు తెలిపారు. అనంతరం రైతు వేదికలోని అగ్రి లీగల్ క్లినిక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శోభ, ఏఈఓలు, పిఎల్వీలు నరేష్, సంతోష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరనగర్‌లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఓపీ ఎంత అవుతుందంటూ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా మందులు సక్రమంగా ఉన్నాయా లేదా అంటూ మందులను, రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ నిర్మల, వైద్య సిబ్బంది ఉన్నారు.

పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గంగారెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

న్యూఢిల్లీలో జాతీయ పసుపు బోర్డు చైర్మెన్‌గా పల్లె గంగారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న జాతీయ పసుపు బోర్డు నిజామాబాద్ జిల్లాకు కేటాయించడం సంతోషకరంగా ఉందని, అంతేకాకుండా పల్లె గంగారెడ్డి నిజామాబాద్ వారిని పసుపు బోర్డు చైర్మన్‌గా ప్రధానమంత్రి నియమించడం ఆనందంగా ఉందని పలువురు రైతులు తెలిపారు.

వీడీసీ అధ్యక్షుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామ వీడీసీ అధ్యక్షులు బోయిని శ్రీనివాస్ తల్లి బాలమని బుధవారం మరణించడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బస్వాపూర్ సొసైటీ వైస్ చైర్మన్ స్వామి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, గ్రామపెద్దలు, తదితరులున్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో మండల యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్ యంగ్ ఇండియా కె బోల్ సీజన్-5 కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి ఉపన్యాస పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం అంబేద్కర్ చేసిన సేవల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సిద్ధ రాములు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు జీవన్, పార్టీ నాయకులు కిరణ్, ఎల్లం, గణేష్, స్వామి, బాబు, ప్రేమ్, మధు, చందు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యయే మంచి జీవితానికి పునాది

నవతెలంగాణ-భీంగల్ రూరల్



విద్యయే మంచి జీవితానికి పునాది అని మండల అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని దేవనపల్లి గ్రామంలో ఎంపియుపిఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధిని స్వయంగా పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, స్టోర్ రూమ్, పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పిల్లలు ఈ వయసులోనే చదువు పట్ల ఆసక్తి చూపే విధంగా ఆధ్యాపకులు వారితో మమేకమై చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

విద్యార్థులు ఆఫర్ జనరేట్ చేసుకోవాలి

- మండల విద్యాధికారి రాజ గంగారాం

నవతెలంగాణ-ఆర్మూర్

పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆఫర్ జనరేటర్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల విద్యాధికారి రాజ గంగారం అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆఫర్ నమోదుకు తల్లిదండ్రుల సమ్మతి పత్రం కావాలని, ఇందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల విద్యాధికారి

శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి టెంపుల్‌లో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలి ప్యాక్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జక్రాన్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ జితేందర్, కొలిప్యాక్ మాజీ ఎంపిటిసి ముద్దుల రమేష్, సింగిల్ విండో మాజీ చైర్మన్ భాస్కర్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజులు గా జరుగుతున్న యజ్ఞం పూజలో పాల్గొన్నారు.

రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-బాల్కొండ

భద్రాచలంలో ఫిబ్రవరి 4,5 తేదీల్లో జరగబోయే పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని శుక్రవారం పిడిఎస్‌యు నాయకులు కోరారు. మండల పరిధిలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిడిఎస్‌యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు. ఏరియా నాయకులు బీరుగొండ, సంధ్య, సుజాత, లహరి, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సత్యనారాయణ

- బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆర్మూర్



నూతన తహసీల్దారుగా సత్యనారా యణ శు క్రవారం బాధ్యతలను స్వీకరిం చారు. ఇంతకుముందు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన గజానన్ బదిలీ అయ్యారు. మోర్తాడ్ ఎమ్మార్వోగా విధులు నిర్వర్తించిన సత్యనారాయణ ఆర్మూర్ తసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సంపూర్ణంగా సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల పరిధిలో భీంగల్ పోలీస్‌లు గురువారం రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కుప్కల్ గ్రామ శివారులో ఇసుక లోడ్‌తో వస్తున్న మూడు ట్రాక్టర్‌లను ఆపి అట్టి ఇసుకకు సంబంధించిన పత్రాలు అడుగగా ఎలాంటి పత్రాలు చుపించలేకపోవడంతో అక్రమంగా తరలిస్తున ఇసుక ట్రాక్టర్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ.. చట్టానికి వ్యతిరేకంగా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

త్వరలో ఆలూర్ మండలంలో పంచాయతీ శాఖ సేవలు

నవతెలంగాణ-ఆర్మూర్

నూతనంగా ఏర్పడిన ఆలూర్ మండలం ప్రజలకు త్వరంలో పంచాయతీ శాఖ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎంపీడీవో కార్యాలయ ఏర్పాటుకు సంబంధించిన భవనాన్ని శుక్రవారం ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం, తహసీల్దార్ రమేష్, కార్యదర్శి రాజలింగం తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా, ఎంపీడీవో సాయిరాం మాట్లాడుతూ.. మండల పరిషత్ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైందని తెలిపారు. మండల పరిషత్ వల్ల గ్రామాల ప్రజలకు పరిపాలన మరింత చేరువ అవుతుందన్నారు. ఈ కార్యాలయం ప్రారంభం కావడంతో ఉపాధి హామీ పనులు మరింత వేగవంతంగా అవుతాయని, తాగునీరు , సాగునీరు, రోడ్లు, పెన్షన్లు, ఏఈ, ఎంపీటీసీ ల సమస్యలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తమ పనులను సమర్థంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు సౌకర్యాలు అందించగలుగుతామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా బాల బాలికల జట్లకు ప్రథమ స్థానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 29 నుండి 31 వరకు ఒలంపియా స్కూల్ తూప్రాన్ మెదక్ జిల్లాలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర అండర్-14 సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా బాల బాలికల జట్టు ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై 06-0 పరుగుల తేడాతో విజయం సాధించింది. బాలుర జట్టు ఫైనల్ మ్యాచ్లో మెదక్ జిల్లా జట్టుపై తలపడి 07-05 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముఖ్యఅతిథి తూప్రాన్ మండల విద్యాధికారి సత్యనారాయణ, టోర్నమెంట్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ పరిశీలకులు మర్కంటి గంగా మోహన్, మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి రమేష్ ట్రోఫీ బంగారు పతకాలు అందజేశారని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి తెలిపారు. జిల్లా జట్లను జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్ అభినందించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఐదుగురు వ్యక్తులకు జైలు శిక్ష

- 10 మందికి జరిమానాగ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్ష విధించగా పదిమందికి జరిమానా పడిందని ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపారు. జనవరి 30న మద్యం తాగిన 15 మందికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ముందర హాజరుపరచగా 10 మందికి 12,500 జరిమానా విధించి, ఖిల్లా రోడ్డుకు చెందిన ఎస్.కె అఫ్రోజ్‌కు మూడు రోజుల జైలు శిక్ష, మోపాల్‌కు చెందిన చాకలి సుమన్‌కు, చత్తీస్‌ఘడ్‌కు చెందిన అగందాస్ పారే, నాందేడ్‌కు చెందిన లక్ష్మణ్‌కు, ఖానాపూర్ కు చెందిన ఎల్ ఆత్మ రావుకు రెండు రోజుల జైలు శిక్ష పడిందని సిఐ తెలిపారు.

పాఠశాలలో కుష్టు వ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కుష్ఠి వ్యాధిపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గిరిబాబు మాట్లాడుతూ.. లెప్రసీ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లేప్రే అనే బ్యాక్టీరియా వల్ల కలుగుతుందని ఈ వ్యాధి ముఖ్యంగా చర్మాన్ని నరాలను ప్రభావితం చేస్తుందని తెలిపారు. శరీరంపైన తెల్లని రాగి రంగు మచ్చలు కలిగి ఉండి స్పర్శను కోల్పోయి ఉన్నట్లయితే లెప్రసి లక్షణాలు ఉన్నట్టుగా భావించాలన్నారు. ఈ వ్యాధికి మల్టీ డ్రగ్ తెరపి ద్వారా చికిత్స చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, ఆశ కార్యకర్తలు అరుణ, సుభద్ర, రమ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

- 18 ఏళ్ళలోపు వారు వాహనాలు నడపొద్దు
- యజమానికి జైలు శిక్ష, జరిమానా
- ట్రాఫిక్ ఏసిపి నారాయణ, ఆర్టిఓ ఉమా మహేశ్వర్ రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయని,18 ఏళ్ళ లోపు ఉన్నవారికి వాహనాలు అప్పగించే వారికి జైలు శిక్ష తోపాటు 25 వేల జరిమానా విధించి పిల్లవాడికి 18ఏళ్ళు నిండేవారకు జువెనైల్ హెూం హైదరాబాద్ కు తరలించడం జరుగుతుందని నిజామాబాద్ ట్రాఫిక్ ఎసిపి నారాయణ, ఆర్టిఓ ఉమా మహేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని అత్వంగ్ డిచ్‌పల్లి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇందల్‌వాయి టోల్ ప్లాజా వద్ద విద్యార్థులకు, ప్రజలకు, డ్రైవర్లకు సిబ్బందికి రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ ట్రాఫిక్ ఎసిపి నారాయణ, నిజామాబాద్ ఆర్టిఓ ఉమా మహేశ్వర్ రావు, డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఐటీ రామారావు పాల్గొని మాట్లాడారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు కనిపించి నప్పుడే మనకు హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకో వాలని గుర్తొస్తుందని అలా కాకుండా వాహనంపై బయటికి వెళ్తున్నప్పుడు కుటుంబ సభ్యుల కొరకు ధరించి వెళ్లాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను అలవాటు చేసుకొని ఎల్లప్పుడూ దానిని పాటించి మన ప్రాణాలను మనం రక్షించుకోవాలని సూచించారు. జనవరి 1 నుండి 31 వరకు కాలేజీలో, పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, ట్రాఫిక్ చట్టాలు, నియమాలపై అవగాహన కార్యక్రమం రోజు ఒక విధిగా చేయడం జరిగిందన్నారు. రహదరి నిబంధనలు పాటించకుంటే జరిగే అనర్థాలకు వివరించామని తెలిపారు. తమతమ ఇంట్లో తల్లిదండ్రులు,అన్న తమ్ముళ్ళకు అవగాహన కల్పించాలని సూచించారు. ఘటన జరిగిన వెంటనే మానవతా దృక్పథంతో స్పందించి టోల్ ఫ్రీ నెంబర్ లకు సమాచారం ఇవ్వాలని, యాక్సిడెంట్ తర్వాత గోల్డెన్ అవర్‌లో ఐదు, పది నిమిషాల్లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తారని రోడ్డు ప్రమాదాలనుండి ఎలా రక్షించాలి ఏవేవి చేయాలో క్లుప్తంగా వివరించారు. మద్యం సేవించి సెల్‌ఫోన్లో మాట్లాడుతూ.. సీటు బెల్టు పెట్టుకోకుండా వాహనం నడిపించుకుని లేని ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని అన్నారు. ప్రతి వాహనదారుడు పలుచోట్ల ఏర్పాటు చేసిన సైన్ బోర్డులను చూస్తూ ఉండాలని, తమ ప్రయాణాన్ని సాఫీగా సాగించుకోవాలని తెలిపారు. తప్పుడు మార్గంలో వెళ్లినప్పుడే చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదంలో దేశంలోనే భారతదేశం మొదటి స్థానంలో ఉందని ఒక ఏడాదిలో లక్షన్నర పైచిలుకు మంది మృత్యువాత పడుతున్నారని, ఇంకా ఐదు లక్షల వరకు తీవ్రగాయాల పాలవుతున్నట్లు వివరించారు. ప్రజల భాగస్వామ్యం లేకపోతే ఎలాంటి కార్యక్రమాలు చేసిన ఫలితం ఉండదని అన్నారు. అతివేగం రాంగ్‌సైడ్ యూటర్న్‌ల వద్ద ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అలా కాకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటించాలని సూచించారు. అనంతరం పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసాలు, ఇతర పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఇందల్ వాయి టోల్ వే ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ కుమార్ సింగ్, నీరజ్ దేశ్ పాండే, టోల్ ప్లాజా మేనేజర్ చలపతిరావు, వీరబాబు, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత

పోలీస్ రవాణా శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఆర్మూర్ : పట్టణంలోని జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా పోలీసులు, రవాణా శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. వాహనదారులు అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో

నిజామాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నిజామాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని

సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు. నేటి నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పంటలకు గిట్టుబాటు ధరలు, తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీల అమలుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికై అధిక నిధులు కేటాయించాలని నిజామాబాద్ జిల్లా ప్రజల చిరకాల కోరిక అయిన బోధన్-బీదర్ రైల్వే లైన్, ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పసుపుబోర్డు ఏర్పాటుకై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలలన్నారు. పసుపు పండించిన రైతాంగానికి క్వింటాలుకు 15000 రూపాయలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధికై కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సు ప్రకారం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించాలని, ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న కార్మిక వర్గానికి సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమానవేతనం చెల్లించాలని, పేద ప్రజలపై పన్నులు వేయకుండా ఈ బడ్జెట్ ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి వై ఓమయ్య, సిపిఐ దక్షిణ మండల కార్యదర్శి పి.ముత్యాలు నాయకులు దేవేందర్, పవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రోటరీ ఒకేషనల్ ఎక్స్‌లెన్స్ సర్వీస్ అవార్డ్స్ ప్రధానం



పలువురికి అవార్డు ప్రధానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక బర్కత్పురనందుగల రోటరీ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో రోటరీ వొకేషనల్ సర్వీస్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు బిరెల్లి విజయరావ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ జిల్లా 3150 డిప్యూటీ గవర్నర్ ఆకుల అశోక్ హాజరై మాట్లాడారు. రోటరీ అంతర్జాతీయ సంస్థ ప్రతి సంవత్సరం జనవరి మాసంలో రోటరీ ఒకేషనల్ సర్వీస్ ఎక్సలెంట్ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమాన్ని అంతర్రాష్ట్ర స్థాయిలో ప్రతి క్లబ్బులు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అవార్డులను అందుకుంటున్న ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ రోటరీ క్లబ్ సభ్యులు , నవ్య భారతి గ్లోబల్ పాఠశాల చైర్మన్ ఖ్యతం సంతోష్ కుమార్, చింతకుంట అనాధ వృద్ధాశ్రమం బృందానికి, ప్రముఖ యువ బాలిక పైలట్ కుష్బు సాబులకు అవార్డ్స్ అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆర్ గంగారెడ్డి, కోశాధికారి భరత్ పటేల్, కార్యక్రమా డైరెక్టర్ శ్రీకాంత్ జవహర్, సభ్యులు ఇంగు రాజేశ్వర్, జ్ఞాన ప్రకాష్, రాజ్కుమార్ సుబేదార్, పార్సి రాజేశ్వర్, శ్యామగర్వాల్, జి. రామకృష్ణ, తులసీదాస్పటల్, బాబు రావ్, ధన్పల్ శ్రీనివాస్, గోవింద్ జవహర్, జుగల్ సోనీ, సాగర్ మలాని, సుధీర్ గుప్తా, నర్సింగరావు, శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

లాభాల దిగుబడి కోసం జాగ్రత్త తప్పనిసరి

- డివిజనల్ ఉద్యాన అధికారి రుద్ర వినాయక్

నవతెలంగాణ-బాల్కొండ

ఆయిల్ ఫామ్ తోటల నుంచి మంచి దిగుబడి సాధించి అధిక లాభాలు పొందాలంటే రైతులు తప్పకుండా పంట నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని డివిజనల్ ఉద్యాన అధికారి రుద్ర వినాయక్ తెలిపారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో ఉద్యాన శాఖ, ప్రీ యునిక్ ఆయిల్ కంపెనీ వారు రైతులకి పంట నిర్వహణపైన శిక్షణ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి వినాయక్ మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ తోట వేసుకున్న రైతులు అధిక లాభాలు పొందాలంటే తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అందులో ప్రధానంగా ప్రతి మూడు నెలలకొకసారి సిఫార్సు చేసిన మోతాదులో మొక్కలకు ఎరువులు వేయాలని తెలిపారు. అలాగే అంతర పంట వేసుకున్నా రైతులు ముఖ్యంగా ఆయిల్ ఫామ్ మొక్క మొదల వరకు దున్నాకూడదని అలా చేయడం వల్ల మొక్క యొక్క వేరు వ్యవస్థ దెబ్బతిని దీర్ఘ కాలంలో పంట దిగుబడి మీద నష్టం చూపిస్తుందన్నారు. అంతర పంట వేసుకుంటున్న రైతులు మొక్క అడుగు భాగాన ఆకులు తీసివేస్తున్నారని అలా చేయడం సరికాదని పేర్కొన్నారు. వచ్చే వేసవి దృష్టిలో పెట్టుకోని వేడి నుంచి మొక్కలను కాపాడుకోవడానికి రైతులు ఫిబ్రవరి రెండో వారం నుంచి తొలకరి జల్లు వచ్చేవరకు క్రమం తప్పకుండా మొక్క వేరు వ్యవస్థ దగ్గర తడి ఉండేలా నీరు అందించాలని తెలిపారు. ఈ శిక్షణ సదస్సులో ఆయిల్ ఫామ్ కంపెనీ క్లస్టర్ ప్రతినిధి తరుణ్, కోరమాండల్ కంపెనీ అగ్రోనామిస్టు పాపిరెడ్డి, వంశీ, మెరాజ్ రైతులు గడ్డం రాజేందర్, గడ్డం గంగారెడ్డి, గుండెటి గంగారెడ్డి, సరికెల గంగారాం, గంగన్న, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజనల్ ఉద్యాన అధికారి రుద్ర వినాయక్

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

- తల్లి, బిడ్డ క్షేమం



అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రసవం కోసం 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న తరుణంలో గర్భిణీకి పురిటి నొప్పులు ఎక్కువ అవ్వడంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది ఈఆర్‌సిపి వైద్యుల సలహాల ప్రకారం కాన్పు చేశారు. తల్లి, శిశువు క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్ పల్లి గ్రామానికి చెందిన సురేఖకు రెండవ కాన్పు ఇంటి దగ్గర పురిటి నొప్పులు ఎక్కువ అవడంతో కుటుంబ సభ్యులు 108 ఫోన్ చేసి సమాచారం అందించారు. కమ్మర్‌పల్లి 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేస్తూ జగిత్యాల జిల్లా మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో సురేఖకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే 108 సిబ్బంది ఈఎంటి సుంకరి విజయ్ కుమార్, పైలట్ శ్రీనివాస్ ఈఆర్ సిపి వైద్యుల సలహాల ప్రకారం అంబులెన్స్ లోనే ప్రసవం చేయడంతో ఆడబిడ్డ జన్మించింది. అనంతరం తల్లి, బిడ్డను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉండడంతో అంబులెన్స్ లో ప్రసవం చేసిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

హెచ్‌ఎఫ్‌సి రెస్టారెంట్ ప్రారంభం

- నుడా చైర్మన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ నుండి హైదరాబాద్ వెళ్లే బైపాస్‌రహదారిలో హెచ్ఎఫ్‌సి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ను శు క్రవారం నుడా చైర్మన్ కేశ వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ.. హెచ్ఎఫ్‌సి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ప్రజలకు నాణ్యమైన ఫుడ్‌ను అందించే విధంగా అందుబాటులో ఉంచారన్నారు. హెచ్ఎస్‌సీ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. 22వ అవుట్ లెట్‌ను, నిజామాబాద్ నగరంలో ఏర్పాటుచేశారన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎఫ్‌సి నిజామాబాద్ ఫ్రాంఛైజి యజమాని ఢీకొండ సతీష్ మాట్లాడుతూ.. హెచ్ఎఫ్‌సి రెస్టారెంట్లో నాణ్యతతో కూడిన, వెజ్, నాన్ వెజ్ డిషెష్‌లు అందుబాటులో ఉంటాయని, నాణ్యతతో కూడిన ఫుడ్ ఐటమ్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎఫ్‌సి సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

- నారాయణపేట గ్రామ శాఖ అధ్యక్షుడు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని నారాయణపేట గ్రామానికి చెందిన గ్రామ శాఖ అధ్యక్షుడు సోమ రాజేందర్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల కవితకు శుక్రవారం అందజేశారు. దీనికి సహకరించిన నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి లబ్దిదారులు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. నారాయణపేట గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పీజీ పరిక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన వీసి, రిజిస్ట్రార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని మొదటి రోజు శుక్రవారం పీజీ- ఒకటవ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ (థియరీ) ఎం ఏ, ఎమ్మెస్ డబ్ల్యూ, ఎం. కాం, ఎంబీఏ, ఎంసీఏ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్ (ఏపీ ఈ. పి సి హెచ్, ఐఎంబిఏ) (సెమిస్టర్ ఎల్ ఎల్ బి) మరియు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్(ఐ ఎం బి ఏ) ఏడవ మరియు తొమ్మిదవ సెమిస్టర్ పరీక్షలను తెలంగాణ యూనివర్సిటీ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలంగాణ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ .టీ.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏం యాదగిరి ఆకస్మిక తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీ లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి, పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ యం అరుణ అడిషనల్ కంట్రోలర్ డాక్టర్.బి సాయిలు, వైస్ ప్రిన్సిపాల్ డా.సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ వర్సిటీ మెయిన్ క్యాంపస్, సౌత్ క్యాంపస్ బిక్నూర్, గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నిజాంబాద్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బోధన్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ కామారెడ్డి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్, ఎస్ ఆర్ ఎం కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 2253 మంది విద్యార్థులకు 2140 మంది విద్యార్థులు హాజరయ్యారు. 113 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 1739 మంది విద్యార్థులకు1665 మంది విద్యార్థులు హాజరయ్యారు 74 మంది విద్యార్థులు గైరాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ అధికారి దివ్య అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌పై వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ ఎలా వేయాలి, అర్హులను ఎలా గుర్తించి యాప్‌లో ఏ విధంగా అప్లోడ్ చేయాలనే వివరాలపై శిక్షణనిచ్చారు. గత ఐదు సంవత్సరాల నుంచి టీబీ వ్యాధిగ్రస్తుల జాబితా, బిఎంఐ 18 అంటే తక్కువ ఉన్న వాళ్లను, పొగతాగే వారిని గుర్తించి వారి పేర్లు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రారంభించగానే గుర్తించిన వారందరికీ అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటరమణ, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పురాం రాజమౌళి



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త పురాం రాజమౌళిని ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రతి ఒక్కరూ సంఘం అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు లేకుండా చూసుకోవాలి

- డిఎల్పిఓ శ్రీనివాస్

నవతెలంగాణ-విలేకరుల బృందం

భిక్కనూర్(రాజంపేట్) : మండలంలోని ప్రజలకు నీటి కష్టాలు లేకుండా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎల్పిఓ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్పిఓ మాట్లాడుతూ గ్రామాలలో నీటి సమస్యలను గుర్తించి త్వరగా పరిష్కరించాలని, గత వేసవికాలంలో నీటి సమస్యతో బాధపడుతున్న కాలనీలలో ముందుగానే నీటికష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రజిత, ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఏపీవో రాధిక, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి : ఎంపీడీవో రఘురాం

రాజంపేట్ మండలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రఘురాం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అపర్ణ, ఏఈ రజిత, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాద్వాయి : తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఏ గ్రామానికి అయినా తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. బోరుబావులు, విద్యుత్ మోటార్‌లకు ఏమైనా సమస్య వస్తే సత్వరమే పరిష్కరించి తాగునీటి సమస్య రాకుండా చూడాలని, తాగునీటి సమస్యపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా.. చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎప్పటికప్పుడు వాటర్ మెన్‌లు పైప్‌లైన్లపై పర్యవేక్షణ ఉండేలా సూచించాలని, వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చిందని గ్రామాల్లో ఎక్కడ కూడా వాల్ పోస్టర్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికలు జరిగే గదులను పర్యవేక్షించి నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సవితారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభు లింగం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్: సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డిఓ సురేందర్



జుక్కల్: మాట్లాడుతున్న పలువురు

లింగంపేట్ : వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని డీఆర్డిఓ సురేందర్ ఆదేశించారు. శుక్రవారం మండలంలో ఆయన పర్యటించి కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ఎద్దడి ఎక్కడ ఉందో ముందే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత కార్యదర్శులు గ్రామాల్లో రోజువారీగా తాగునీటి సమస్య గురించి వివరాలు అందించాలన్నారు. తాగునీటి సమస్య అధికంగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ సురేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపిఓ మలహరి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ అధికారులు సయ్యద్ నయీమ్ అన్నారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్, గ్రీడ్ అధికారులు సయ్యద్ నయీమ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, జీపి సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భాస్కరన్, ఆయా గ్రామాల జీపి సెక్రటరీలు, నీటి సరఫరా ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి

- మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు

నవతెలంగాణ-రెంజల్/ఎడపల్లి/పోతంగల్

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరని.. అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని బోర్గం గ్రామ ప్రధానోపాధ్యాయులు బోడ నరసింహారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసింహారెడ్డి 38 సంవత్సరాల ఉద్యోగ కాలంలో సుమారు 26 సంవత్సరాలు రెంజల్ మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసి మండల ప్రజలతో కలిసి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. విద్యా బోధనతో పాటు పిఆర్‌టియు శాఖలో వివిధ పదవులను చేపట్టి ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించారని ఆయన అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనదని ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు పునాదులు వేసిన వారవుతారని ఆయన స్పష్టం చేశారు. ఆయన శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఈ.శంకర్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మాజీ మండలాధ్యక్షులు మోబిన్‌ఖాన్, మేక సంతోష్, ధనుంజయ్, పిఆర్‌టియు అధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగంగౌడ్, కిషోర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు సాయిరెడ్డి, బోర్గం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్య భారతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కృష్ణ, శంకర్, శ్రీరామ్, అయూబ్, తాహెర్, శ్రీనివాస్‌రెడ్డి బాలకృష్ణ, నారాయణరెడ్డి, బాబురావు, హనుమంత్‌రెడ్డి, మహోదయ క్లబ్ అధ్యక్షులు భూమారెడ్డి, అన్నదాత మోహన్‌రెడ్డి, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదవి విరమణ పొందిన ఉద్యోగికి సన్మానించిన పలువురు

ఎడపల్లి : ప్రభుత్వ ఉద్యోగులకు, సిబ్బందికి ఉద్యోగ విరమణ తప్పదని పిఆర్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ తెలుగు ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి.. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన సాయిలు ఆయన సతీమణి రాజమణికి పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ మండల శాఖ కార్యదర్శి గోవర్ధన్, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఏనుగు కిషోర్ కుమార్, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ : మండలంలోని ఉపాధ్యాయుడు గంట్ల గంగాధర్ 39 సంవత్సరాల రెండు నెలల సుదీర్ఘ సేవలందించి కోటగిరి ఎంపిపి ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. దివ్యాంగుడైనప్పటికి కష్టపడి, అహర్నిశలు కృషిచేసి, చదవడమే కాక, విద్యార్థులకు నిరంతర సేవ చేసి, వారి హృదయాలలో నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పిఆర్‌టియు మండల అధ్యక్షులు బర్ల సాయిలు, వినోద్, కిరణ్, సంధ్య, కె.గంగాధర్, రిటైర్డ్ ఇఓ, ప్రదీప్ జూనియర్ కాలేజ్ లెక్చరర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోషణ లోపాన్ని పరిష్కరించొచ్చు

- శిక్షణలో టిఓటి జగదీష్

నవతెలంగాణ-మద్నూర్

పిల్లల్లో పోషణ లోపాన్ని సాధారణ ఆరోగ్య పోషకాహార పద్ధతులను అనుసరించి పరిష్కరించవచ్చని టిఓటి జగదీష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో పిల్లల్లో పోషణ లోపంపై నిర్వహించిన కార్యక్రమంలో వీవోఏలకు అవగాహన కల్పించారు. పిల్లల్లో పోషణ లోపం తగ్గించడం, నివారించడంపై వీవోఏ, గ్రామ సంఘం సభ్యులకు శిక్షకులు జగదీశ్, సాయిలు శిక్షణను అందజేశారు. ప్రతి గ్రామాలలో ఐదేండ్లలోపు పిల్లల్లో పోషకలోపం పెరుగుతుందని, దీనివల్ల వారి శరీరక పెరుగుదల, మానసిక వికాసం బలహీనపడుతుందన్నారు. పిల్లల్లో పోషణ లోపాన్ని సాధారణ ఆరోగ్య, పోషకాహార పద్ధతులను అనుసరించి పరిష్కరించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో టిఓటి జగదీష్, సాయిలు, అలాగే మండల మహిళా సమాఖ్య ఐకెపి ఎపిఎం రవీందర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కవిత, సీసీలతో పాటు వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిఓటి జగదీష్

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో గల ఐకెపి కార్యాలయంలో శుక్రవారం పిల్లల పోషణలోపం తగ్గించడానికి ఆయా గ్రామాల విఓఏలకు గ్రామ సంఘం సభ్యులకు శిక్షకులు రామనారాయణగౌడ్, శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో ఐదేండ్లలోపు పిల్లల్లో పోషకలోపం పెరుగుతుందని, దీనివల్ల వారి శారీరక పెరుగుదల, మానసిక వికాసం బలహీన పడుతుందన్నారు. పిల్లల్లో పోషణ లోపాన్ని సాధారణ ఆరోగ్య, పోషకాహార పద్ధతులను అనుసరించి పరిష్కరించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య పదాధికారులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేట ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ కూల్చివేత

- కారకులపై చర్యలు తీసుకోండి
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడను ఈ నెల 29న ముత్యంపేట మాజీ ఉపసర్పంచ్ శిరీష్‌గౌడ్, అతని అనుచరులు డిసిఎంతో ఉద్దేశ పూర్వకంగా గుద్దడం వల్ల ప్రహరీగోడ కూలిపోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ముత్యంపేట్ గ్రామస్తులు శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డికి కామారెడ్డి ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే వెంటనే స్పందించి జిల్లా ఎస్పీకి ఫోన్‌చేసి ముత్యంపేట్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ కూల్చివేతకు కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని



రెండు ఎంపీటీసీలు పెంచండి

- ఎంపీడీవోకు బిజెపి నాయకుల వినతి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జనాభా లెక్కల ప్రకారం మద్నూర్ మండలంలో మరో రెండు ఎంపీటీసీ స్థానాలు పెరిగే అవకాశాలున్నందున ప్రజల సౌలభ్యం కోసం ప్రభుత్వం తమ విజ్ఞప్తిని మన్నించి రెండు ఎంపీటీసీ స్థానాలు పెంచాలని మద్నూర్ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో రాణి, డోంగ్లి మండల ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకట నరసయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షులు తెప్ప తుకారం, బిజెపి ముఖ్య సీనియర్ నాయకులు కృష్ణపటేల్, వెంకట్ కాలే, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ ప్రాంగణంలో ప్రారంభమైన పీజీ పరీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బిటిఎస్ వద్ద గల తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణంలో పీజీ మొదటి, మూడవ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ తెలిపారు. పరీక్షలకు మొత్తం 169 విద్యార్థులకు గాను 162 విద్యార్థులు హాజరైనట్లు, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

మందకృష్ణ మాదిగ చేసిన పనులకు గుర్తింపే పద్మశ్రీ అవార్డు

- జిల్లా అధ్యక్షుడు కోల బాలరాజు గౌడ్



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ఇచ్చిందని కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోల బాలరాజు గౌడ్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం గుర్తించి అందరి గురించి ఆలోచించే వ్యక్తిగా చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డునివ్వడం మా అందరికీ గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, ముఖ్య నాయకులు లక్ష్మీ నరసవ్వ రాజవ్వ, రాజనర్సు, నర్సింలు, రమేష్, సింగరేపల్లి బాలరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ పక్షోత్సవాలు

- విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జంతు సంక్షేమ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పశు వైద్యాధికారి దేవేందర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనోటిక్ వ్యాధులలో ముఖ్యమైనది ర్యాబిస్ వ్యాధని, కుక్కకాటు వలన రాబిస్ వ్యాధి వస్తుందని తెలిపారు. ర్యాబిస్ వ్యాధి వస్తుందని కుక్క కరిచిన వెంటనే సబ్బుతో శుభ్రంగా కడుక్కొని దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లి ఆంటీరాబిస్ టీకా తీసుకోవాలని సూచించారు. పెంపుడు జంతువుల పట్ల ప్రేమతో, జాగ్రత్తగా ఉండాలని, జంతువులను హింసకు గురిచేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, ఉపాధ్యాయులు రాజు, మంజుల, నర్సింలు, మహేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ విజేతలకు బహుమతుల పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసినట్లు ఫోరం అధ్యక్షులు గిర్మ బోయి తెలిపారు. తాడ్వాయి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి, తాడ్వాయి ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, పిఎస్‌టి అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో కస్తూర్బాగాంధీ, జిల్లా పరిషత్ పాఠశాల కృష్ణాజివాడి, తాడ్వాయి, వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఫిబ్రవరి నాలుగో తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పిఎస్‌టి కార్యదర్శి శ్రీకాంత్, సంతోష్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కోడెదూడలకు గడ్డి వితరణ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో ఉన్న కోడె దూడలకు మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన లింగయ్య ట్రాక్టర్ వరిగడ్డిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు ఆలయ ఆవులకు గడ్డి వితరణ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు యువత నియోజకవర్గ ఇన్చార్జిగా ముదాం దత్తాత్రేయ

నవతెలంగాణ-తాడ్వాయి

ఎల్లారెడ్డి మున్నూరు కాపు యువత ఇన్చార్జిగా తాడ్వాయికి చెందిన ముదాం దత్తాత్రేయను నియమించినట్లు రాష్ట్ర మున్నూరు కాపు యువత అధ్యక్షులు బండి సంజీవ్ నియామకపత్రాన్ని శుక్రవారం అందజేశారు. నియోజకవర్గంలో పేద విద్యార్థులను హాస్టల్లో చేర్పించేందుకు కృషి చేయాలని, నియోజకవర్గం మున్నూరు కాపు రైతు సమస్యలపై సామాజికంగా, ఆర్థికంగా నష్టపోతున్న తమ జనాభాపై బీసీ రిజర్వేషన్ల పెంపునకు నియోజకవర్గంలో చైతన్యం తీసుకురావాలని నియామకపత్రంలో పేర్కొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ భూమిపూజకు రావాలని ఆహ్వానం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో ఫిబ్రవరి 3న వసంత పంచమి సందర్భంగా నూతన అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు అయ్యప్ప స్వామి భక్తులు తెలిపారు. భూమిపూజకు ప్రముఖులను ఆహ్వానించినట్లు వారు పేర్కొన్నారు. ఆహ్వానించిన వారిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జనార్ధన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ బోయిని రాధా విట్టల్, మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డితో పాటు పలువురిని ఆహ్వానించినట్లు వారు పేర్కొన్నారు.

పిహెచ్‌సి ఉద్యోగులకు సన్మానం



పిహెచ్‌సి ఉద్యోగులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పిహెచ్‌సి ఉద్యోగులను సన్మానించారు. పిహెచ్‌సి సూపర్‌వైజర్ లీలావతి ఉద్యోగ విరమణ పొందారు. డాక్టర్ శ్రీలేఖ బదిలీపై ఆరోగ్య కేంద్రం రాజీవ్ నగర్‌కు బదిలీ అయ్యారు. సదాశివనగర్ పీహెచ్‌సి కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి రెగ్యులర్ స్టాఫ్ నర్స్‌గా సిరిసిల్ల జిల్లాలో ఉద్యోగం వచ్చిన సందర్భంగా ఆమెకు సన్మానించారు. డాక్టర్ ఆస్మా ఆఫ్షన్ మాట్లాడుతూ.. లీలావతి శేషజీవితంలో సుఖవంతంగా ఉండాలని అన్నారు. ఆ ముగ్గురిని శాలువాలతో పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నాగరాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

నవతెలంగాణ-లింగంపేట్

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని శెట్పల్లి కాంప్లెక్స్ హెచ్ఎం వసుధ అన్నారు. శుక్రవారం సజ్జన్‌పల్లి, ఎక్కపల్లి, ఎక్కపల్లితండా పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సాలూర మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని శుక్రవారం రాత్రి సాలూర మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు వెంకటస్వామి సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. మండలాధ్యక్షులుగా బూరె శంకర్, ప్రధాన కార్యదర్శిగా దిలీప్, ఉపాధ్యక్షులుగా విజయ్, బాలరాజ్, రవికిరణ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా రెడ్డి నగేష్, సీహెచ్ శ్రీనివాస్, రెడ్డి శ్యాంరావు, సభ్యులుగా సీహెచ్ రవి, సందీప్, గంగన్ శివ, పులి అంజిని ఎన్నుకున్నారు. అలాగే మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షులుగా పానుగంటి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. లక్షడప్పుల, వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్రనాయకులు వెంకటస్వామి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూమయ్య, సీనియర్ నాయకులు లింబూరి లక్ష్మణ్, నాగురావు, లస్మయ్య గ్రామ అధ్యక్షులు సుభాష్, చంటి, రవి, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీలో పేట్‌సంగం పాఠశాల బాలికలకు ద్వితీయ బహుమతి

నవతెలంగాణ-గాంధారి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గాంధారి మండలంలోని పేట్‌సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేట్‌సంగెం పాఠశాల బాలికలు ద్వితీయ బహుమతి సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త క్రీడా దాత ఏనుగు దయానంద్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న పేట్‌సంగం క్రీడాకారిణి అద్భుతంగా రాణించి ద్వితీయ బహుమతి సాధించారు. వరుసగా పోచంపాడ్, ఇందల్వాయి, నిజామాబాద్ జట్లను ఓడించి ద్వితీయస్థానం సాధించారు. గెలుపొందిన జట్టుకు నిర్వాహకులు షీల్డ్‌తో పాటు ఐదువేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ గంగాధర్, రాజ్‌కుమార్, ఓ.రమేష్, గండికోట రవి, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రాఘవి

నవతెలంగాణ-బాల్కొండ

చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఓడ్డి రాఘవి ఓపెన్ కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిందని శుక్రవారం రాఘవి తండ్రి రఘువీర్ తెలిపారు. హైదరాబాదులో ఇటీవల తెలంగాణ స్టేట్ ఓపెన్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి కిక్ బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఓడ్డి రాఘవి గోల్డ్ మెడల్ సాధించింది. రాఘవికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పిఇటి శ్రీనివాస్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాఘవి మరింతగా క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.



ఏర్గట్ల ఏపీఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

పీడీ సాయగౌడ్

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల సమాఖ్యలో పనిచేస్తున్న ఏపీఎం శ్యామ్‌పై ఏర్గట్ల క్లస్టర్ వీఓఏలు పలు ఆరోపణలు చేస్తూ...జిల్లా అధికారి పీడీ సాయగౌడ్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. బుధవారం డీపీఓలు మారుతి, సంధ్యారాణి మండల సమాఖ్యకు వచ్చి విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. కాగా ఈ విషయమై నవతెలంగాణ పీడీ సాయగౌడ్ ను వివరణ కోరగా విచారణ చేపట్టామని, ఏపీఎం శ్యామ్‌పై కచ్చితంగా త్వరలోనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. మహిళ సంఘాల మహిళల పట్ల, వీఓఏల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే, దుర్భాశలాడితె సహించేది లేదని అన్నారు.

ఆలూరు మండల ఎంపీటీసీల ఓటర్ డ్రాఫ్ట్ విడుదల

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలనికి ఎంపీటీసీల ఎలక్షన్ డ్రాఫ్ ను ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ... ఆలూరు మండలానికి 9 ఎంపీటీసీలు గుర్తించామన్నారు. ఆలూర్‌లో 2 ఎంపీటీసీలు, కల్లడి, దేగాం, మచర్ల, గుత్ప, గగ్గుపల్లి, మిర్దపల్లి కలిపి ఒక ఎంపీటీసీ, గుత్పతండా, రామచంద్ర పల్లి ఒక ఎంపీటీసీ, డీకంపల్లి, రామస్వామి క్యాంప్ ఒకటి చొప్పున ఎంపీటీసీలు గుర్తించామని తెలిపారు. సంబంధిత లిస్టు ని ఆలూర్ గ్రామపంచాయతీ ఆవరణంలో అతికించారు. కార్యక్రమంలో ఆలూర్ కార్యదర్శి రాజలింగం, కారాబర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్ట్‌ల అందజేత



టీషర్టులను అందించిన కలిగోట ప్రవంతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కలిగోట ప్రవంతి 75 టీ షర్టు లను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పద్మశాలి ప్రభుత్వ వర్కింగ్, రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు చౌటి భూమేశ్వర్ ఉద్యోగ విరమణ సందర్భంగా పద్మశాలి సంఘ సభ్యులు శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు చౌటి భూమేశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు రుద్ర గణపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వన్నెల్ దాస్ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి క్యాతం జగన్మోహన్, కోశాధికారి కూరపాటి వరప్రసాద్, హరీశంకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వైద్యారోగ్య చరిత్రలో మరో కొత్తశకం ప్రారంభం

- ముఖ్యమంత్రితో కలిసి ఉస్మానియా ఆసుపత్రి
- శంకుస్థాపనలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వందేళ్లుగా తెలంగాణతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని ప్రజా ప్రభుత్వం సంకల్పించగా, శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. కొత్త ఆసుపత్రిని గోషామహల్ స్టేడియంలో 2 వేల పడకల సామర్థ్యంతో ఆసుపత్రిని నిర్మించనున్నారు. ఆసుపత్రి కొత్త భవనాలు కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకే చోట అన్నిరకాల డయాగ్నసిస్ సేవలు, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్ కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లకు రూపకల్పన చేస్తున్నారని చెప్పారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ -బాల్కొండ

మాజీ మంత్రి బాల్కొండ ఎంఎల్ఏ వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో కిసాన్ నగర్ గ్రామంలోని అయిదుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బిఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రశాంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి దాసరి లావణ్య వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎంబరి శరత్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు రహిమోద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంక్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-మెండోర

పోచంపాడు ఎస్బిఐ బ్యాంక్ లో దొంగతనానికి పాల్పడిన నెహ్రూనగర్‌కు చెందిన అడుదుకె.శ్యామ్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి పోచంపాడు ఎస్బిఐ బ్యాంక్ షెట్టర్ తాళాలు పగులగొట్టి దొంగతనానికి ప్రయత్నించినట్లు బ్యాంక్ మేనేజర్ శుక్రవారం ఉదయం మెండోర పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ బ్యాంకులో గల సీసీటీవీ పుటేజీ పరిశీలించి నెహ్రూ నగర్‌కి చెందిన కె.శ్యామ్ గా గుర్తించి ఆయన్న ఇంటి వద్ద పట్టుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. దాంతో అతన్ని ఎస్ఐ అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ నారాయణ పేర్కొన్నారు.

ఆత్మహత్యకు కారణాలు తెలియాలి

- మిషన్ భగీరథ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మిషన్ భగీరథ (ఆర్డబ్ల్యూఎస్) ఏఈఈ కే.సాయి చరణ్ ఆత్మహత్య పాల్పడడానికి అసలు కారణాలేంటో పూర్తిగా తెలియజేయాలని జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ జిల్లా కార్యాలయం ముందు తోటి ఉద్యోగులు జస్టిస్ ఫర్ సాయి చరణ్ అనే ఫ్లగ్ కార్డులతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథలో నవంబర్ 2024 లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కే సాయి చరణ్ మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడని, వెంటనే ఆయనను హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లిన మృతిచెందాడని అన్నారు. ధర్పల్లి మండలంలోని నూతనంగా బాధ్యతలు చేపట్టినప్పటికీ మండలంలో సుమారు 1000 నల్లాల వరకు కనెక్షన్లు ఇవ్వవలసి ఉండగా, దానిని నల్ల కనెక్షన్లలో కులాయిలను బిగించుటకు సరైన బడ్జెట్ లేకపోవడంతో గ్రామపంచాయతీ సెక్రటరీ ద్వారా డబ్బులు చెల్లించుటకు సమస్యలు ఏర్పడడం, ఒత్తిడిల వల్లనే సూసైడ్ చేసుకోవడం జరిగిందని అన్నార. ఆత్మహత్య పాల్పడడానికి గల అసలు కారణాలు ఏంటో పూర్తిగా విచారణ చేపట్టాలని, అసలు ఒత్తిడికి గల కారణాలు ఏంటో వివరించాలని కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డిఈఈ మున్య నాయక్, ఈఈ రాకేష్, ఇతర ఇంజనీర్ రాము, ధనరాజ్, దర్మేందర్,దామోదర్,శివ, అజయ్, బస్వరాజ్,గబ్బర్ సింగ్, సంధ్య, రమాదేవి, కావ్య, ప్రమోద్, గంగారం, అనిల్, ఏఈఈలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ముప్కాల్ తహసీల్దార్‌గా కన్నాజీ గజానన్

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ తహసీల్దార్ గా కన్నాజీ గజానన్ శుక్రవారం రోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛంను అందజేశారు. ఆర్మూర్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ముప్కాల్‌కు రావడం జరిగిందని డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీకాంత్ తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ కర్తవ్యంతో ముందుకు వెళ్తానని డిప్యూటీ తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న పలువురు

ప్రమాద రహిత సర్వీస్‌గల ఆర్టిసి డ్రైవర్లకు సన్మానం

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ప్రమాద రహిత సర్వీస్ రికార్డు కలిగిన ఆర్టిసి డ్రైవర్లను జిల్లా రవాణా శాఖ అధికారి జే. ఉమా మహేశ్వర్ రావు ప్రశంసించారు. నగరంలోని నిజామాబాద్-2 ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా డ్రైవర్లను అభినందించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్టిసి రీజినల్ మేనేజర్ టి. జోస్న సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రవాణా శాఖ అధికారి జే. ఉమా మహేశ్వర్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సురక్షిత సుఖవంతమైన ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. మంచి శిక్షణ అనుభవం గల డ్రైవర్ లతో ఆర్టీసీ నడుస్తుంది అని తెలిపారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలని కోరారు. మైనర్ పిల్లలకు వాహనం ఇవ్వకూడదని, ప్రమాదం జరిగిన యెడల వాహనం యజమానికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, మైనర్‌కి 25 సంవత్సరాల వరకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వరని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ టి. జోస్న మాట్లాడుతూ ప్రమాదాల రేటు 0.9 నుండి 0.8 శాతనికి తగ్గిందని, ఈ ప్రమాదాలు జీరో శాతనికి తీసుకురావాలని కోరారు. రోడ్లు భవనాలు జిల్లా కార్యాలయానికి ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో హెచ్చరిక బోర్డ్స్, ఇతర జాగ్రత్తల సూచనలు పెట్టాలని కోరారు. రీజియన్ స్థాయి ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లను డ్రైవర్లను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఏం) వి. శంకర్, డిప్యూటి, రీజినల్ మేనేజర్(ట) ఎన్. సరస్వతి, పర్సనల్ ఆఫీసర్ పద్మజా, డిపో మేనేజర్, నిజామాబాదు-1 బి.ఆనంద్, నిజామాబాద్-2 ఎన్. సాయన్న, డిపో మేనేజర్లు శ్రీనివాస్, ఆర్. సరిత దేవి పాల్గొన్నారు.



సన్మానం పొందిన ప్రమాదరహితసర్వీసుగల డ్రైవర్లు

బీడీ కంపెనీ టేకేదారుడికి కార్మికుల సన్మానం



టేకేదార్‌ను సన్మానిస్తున్న బీడీకార్మికులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన చార్ బై బీడీ కంపెనీ టేకేదర్ యెనుగందుల జనార్ధన్ ను ఆ కంపెనీలో పనిచేసిన బీడీ కార్మికులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల టేకేదర్‌గా విరమణ చేసిన నేపథ్యంలో జనార్ధన్ దంపతులను బీడీ కార్మికులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. టేకేదరుగా జనార్ధన్ అందించిన సేవలను బీడీ కార్మికులు కొనియాడారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ చార్ భాయ్ బీడీ కంపెనీ టేకేదారుగా 40 సంవత్సరాలకు పైగా తన కంపెనీలో పని చేసిన బీడీ కార్మికులకు సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. తనను సత్కరించిన బీడీ కార్మికులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విడిసి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న వీడీసీ సభ్యులు, బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నీ నందిపేట బిజెపి నాయకులు, పట్టణ వి డి సి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కలసి ఎమ్మెల్యే కు శుక్రవారం వినతి పత్రం అందజేసినారు. మండల కేంద్రంలో ప్రాథమిక సహకార బ్యాంకు , నందిపేట వివేకానంద చౌరస్తా నుండి లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ న్యూ బైపాస్ షాపూర్ రోడ్ వరకు వీధి స్తంభాలు , లైటింగ్ కొరకు అక్కడ రాత్రింబవాలు ఇబ్బంది జరుగుతున్నది కాబట్టి ఎమ్మెల్యే కు వినతి పత్రం ఇవ్వడం జరిగినది .ఇ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నాగ సురేష్ మాజీ ఎంపీటీసీ గాండ్ల నర్సా గౌడ్ మాజీ ఎంపిటిసి రాజు ప్రధాన కార్యదర్శులు సూది సాయికుమార్ పటేళ్ల రాజు వి డి సి గ్రామ అభివృద్ధి కమిటీ సదరులు ఎర్రం మురళి దమ్మాయి సుధాకర్ సాంబారు లక్ష్మీనారాయణ గడ్డం చిన్నారెడ్డి గంగాధర్ గౌడ్ దొడికింది ముత్యం లక్కంపల్లి రవి ,చింత శ్రీనివాస్, బజార్ కొత్తూరు ప్రవీణ్ చుక్కబుట్ల దీపక్, తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ కుమార్ ఆశయసాధనకు యవతను ఐక్యం చేయాలి

నవతెలంగాణ-నవీపేట్

ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అధ్యక్షతన కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ 34వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని నవోదయ కళాశాలలో శుక్రవారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు నరేందర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రగతిశీల భావాలతో యువత ముందుకు వెళ్లాలని అన్నారు. సమాజంలో గుట్కా, గంజాయి, మాదకద్రవ్యాలు, తాగుడు లాంటి బానిస అలవాట్లు చేసుకోకుండా ముందుకు సాగాలని కోరారు. కులం, మతం, వర్గ బేధాలు లేకుండా యువతను ప్రగతిశీల ఆలోచనల వైపు నడిపించిన యువ నాయకుడు వేములపల్లి కిరణ్ కుమార్ అని అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం యువతను ఐక్యం చేసేందుకే క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి డి రాజేశ్వర్, పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, తెడ్డు పోశెట్టి, ప్రిన్సిపల్ రఘురాం, పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పరిశుభ్రత పాటించాలి

- ఎంపీడీవో
- ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది తో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపడుతున్న చర్యలను ఆయన తనిఖీ చేశారు. పనికి రాని టైర్లు, బకెట్లలో, ఖాళీ కొబ్బరి బొండాలలో నీళ్లు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి కుండిలను, పూల కుండీలను శుభ్రంగా ఉంచుకోవాలని, పనికి రాని వస్తువులను పాడవేయలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో మురికి కాలువల వెంట దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శి గంగ జమునకు సూచించారు.ప్రజలు కూడా సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఇంట్లోని చెత్తను వీధిలో, మురికి కాలువలలో పాడేయకుండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులోనే వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగా జమున, ఏఎన్ఎ, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లద్వారా ప్రతిభను గుర్తించొచ్చు

- విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ ఏర్గట్ల/(వేల్పూర్)ఆర్మూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఫిజిక్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుండి ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మండల స్థాయి ఫిజిక్స్ టాలెంట్ టెస్ట్‌లో కోన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన రచిత ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. చౌట్ పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన సభ సాదియా రెండవ స్థానం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని తనుష్క తృతీయ స్థానం సాధించారు. మండల స్థాయి విజేతలు ఈనెల 4న జిల్లా కేంద్రంలో జరుగనున్న జిల్లాస్థాయి ఫిజిక్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని పరీక్షల ఇంచార్జ్ సరోజన లక్ష్మీ తెలిపారు. అనంతరం విజేతలకు కమ్మర్‌పల్లి ఎస్సి, ఎస్టీ ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పసుపుల సాయన్న ఆయా పాఠశాలల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏర్గట్లలో..

ఏర్గట్ల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం తరపున మండలస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్గట్ల కేజీబీవీ పాఠశాల విద్యార్థిని స్రీనిధికి ప్రథమ బహుమతి, తడపాకల్ జడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి కుల్సన్‌కు ద్వితీయ, ఏర్గట్ల జడ్పిహెచ్ఎస్ విద్యార్థిని అస్నియా భానుకు తృతీయ బహుమతి లభించిందని ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తెలిపారు. భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు రాజశేఖర్, సుధాకర్, విఘ్నరాజ్, రవి, వినోద్, స్రవంతి పాల్గొన్నారు.

(వేల్పూర్)ఆర్మూర్: సైన్స్ డే సందర్భంగా మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టెస్ట్ జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన శుక్రవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 8 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారిలో జి.శివాని జడ్పీహెచ్ఎస్ రామన్నపేట్, జస్వంత్ జడ్పిహెచ్ఎస్ అంక్సాపూర్, ఎం. శివన్విత జడ్పీహెచ్ఎస్ మోతే ఎంపిక అయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఎస్‌టి జిల్లా కార్యదర్శి. పసుపుల రఘునాథ్ మండల అధ్యక్షులు గోపాల్, సెక్రెటరీ దేవా శ్రీనివాస్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే ఒక లక్ష్యంవైపు కృషి చేయాలి

- ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు బాల్యం నుంచి ఒక లక్ష్యం వైపు కృషి చేయాలని ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ లో గల లిల్లీపుట్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరానికి మాత్రమే ఉపయోగించాలని, అది చదువుకు ఏమాత్రం ఇబ్బంది కలిగించకుండా చూసుకోవాలని అన్నారు. ఆత్మవిశ్వాసంతో చదువుకున్న సాగించి మంచి జీవిత నైపుణ్యాలను నేర్చుకొని మంచి పౌరులుగా అభివృద్ధి చెందాలని అన్నారు. అనేక అంశాలను స్పృశిస్తూ విద్యార్థులు మొబైల్ నుండి ఎలా తమకు తాము దూరంగా ఉండి పాఠ్యాంశాలపై ఆసక్తి ఎలా కనబరుచుకోవాలో చక్కటి సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు చక్కటి సమాధానం ఇచ్చారు. అలాగే తల్లిదండ్రులకు కూడా సరియైన సూచనలు తెలిపారు. సమాజంలో మంచి పౌరులుగా ఎదగడానికి ఏ రకమైన అలవాట్లు ఉండాలో పాఠశాలలో ఇంటి వద్ద ప్రవర్తించాల్సిన తీరుతెనులను వివరంగా తెలియజేశారు. మంచి సూచనలు తెలియజేసినందుకు సైకాలజిస్టక పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ ,ప్రిన్సిపల్ దాసు ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 01, 2025 | www.navatelangana.com

మన గ్రోమోర్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో రైతుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన మన గ్రోమోర్ సెంటర్ ను శుక్రవారం కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన గ్రోమోర్ కేంద్రంలో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఫర్టిలైజర్ లకు సంబంధించిన నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయన్నారు. అవి కూడా సరసమైన ధరలకే లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సుంకేట రవి, నాయకులు సుంకేట శ్రీనివాస్, ఉట్నూర్ ప్రదీప్, అజార్, బెజ్జారం భాను, మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ, మన గ్రోమోర్ కంపెనీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్ జెడి

నవతెలంగాణ-నవీపేట్



మండలంలోని నాగేపూర్ ఉన్నత, ప్రైమరీ పాఠశాలలతో పాటు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అశోక్ మరియు ఎంఆర్ సి సిబ్బంది రాకేష్ లు ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్లో భారీగా నిధులు కేటాయించాలి

ఉన్నత విద్యను ప్రోత్సహించాలి

టూ టా అధ్యక్షులు డాక్టర్ ఏ. పున్నయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్రం లోని యూనివర్సిటీ ఉన్నత విద్యను మరియు శాస్త్ర సాంకేతిక పరిశోధనలను బలోపేతంచేసి ప్రపంచ స్థాయి విద్యనందించేందుకు పనిచేస్తున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పెంచిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూ టా) ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా టూ టా అధ్యక్షులు డాక్టర్. ఏ. పున్నయ్య మాట్లాడుతూ రాష్ట్ర వర్సిటీల్లో ఏటేటా ప్రొఫెసర్ల ఖాళీలు భారీగా పెరుగుపోతుం డటంతో న్యాక్ గ్రేడ్, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వర్సిటీలు వెనకబడే పరిస్థితి ఉన్నదని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ల పదవీ విరమణపై చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి తోడ్పాటు అందించిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి కి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశం కు, జీవో నం.3 ను విడుదల చేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా లకు టూ టా సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే బడ్జెట్లో యూనివర్సిటీ లకు అధిక నిధులు కేటాయించి, సామాజిక అభివృద్ధికి నూతన కోర్సులను ప్రవేశపెడుతూ బోధనతోపాటు పరిశోధనలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించాలని పేర్కొన్నారు. ఈ జీవో విడుదల సందర్భంగా సీనియర్ ప్రొఫెసర్ల పదవీ విరమణ చేయకుండా తెలంగాణ యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్ గా కొనసాగుతున్న ప్రొఫెసర్ టీ.యాదగిరిరావును తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ శాలువాతో సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ అడికే నాగరాజు, ప్రొఫెసర్ డాక్టర్ కనుకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రొఫెసర్ ఎం అరుణ డాక్టర్ సాయిలు, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ ఎల్లోసా, డాక్టర్ జమీల్ అహ్మద్ , డాక్టర్ పాత నాగరాజు, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



టూ టా అధ్యక్షులును సన్మానించిన పలువురు

న్యాయవాద పరిషత్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వార్షిక క్యాలెండర్‌లో వార్షిక ప్రగతి ప్రణాళికలు ఉంటేనే వాటికి సార్థకత లభిస్తుందని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం న్యాయవాద పరిషత్ రాష్ట్ర కమిటీ రూపొందించిన 2025 వార్షిక క్యాలెండర్ ను జిల్లాకోర్టు ప్రాంగణంలో ని బార్ సమావేశపు హాల్ లో పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. నరేందర్ రెడ్డి, సభ్యులు దయావార్ నగేష్, బిట్ల రవి,బండారి కృష్ణనంద్, కిరణ్ కుమార్, భాను చందర్,స్నేహ, లిల్లీ, నరేష్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. న్యాయవాద పరిషత్ జాతీయవాద దృక్పథంతో కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఒకే దేశం, ఒకే ప్రజా అనే సిద్ధాంతం ప్రతిప్రాధికన పని సంస్కృతిని పరిషత్ లక్ష్యంగా కలిగి ఉన్నదని జగన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ కార్యదర్శి వసంత్ రావు న్యాయవాదులు ఆశా నారాయణ, శరత్ చంద్ర, రణదీశ్,శ్రీహరి ఆచార్య, వేణు,మానిక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం చలో హైదరాబాద్

- సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆరు గ్యారంటీల అమలు కోసం పూర్తిగా రుణమాఫీ,రైతు భరోసా అమలు కోసం ఫిబ్రవరి 20న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య కోరారు. శుక్రవారం డిచ్ పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆకుల పాపయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో మహిళలకు ఫ్రీ బస్సు తప్ప, మిగతావి అమలు చేయలేదన్నారు. రైతులకు 2 లక్షల రుణమాఫీ, మహాలక్ష్మి కింద నెలకు 2500, కౌలు రైతులతో సహా రైతులందరికీ రైతు భరోసా 15000 వేయాలని అన్ని రకాల పంటలకు 500 బోనస్ ఇవ్వాలని, ఇండ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు, ఇంటి స్థలంతో పాటు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, తెలంగాణ సాధన ఉద్యమకారులకు 250 గజాల స్థలం, చేయుత పథకం కింద వృద్ధులకు 4000 రూపాయల పింఛను, కళ్యాణ్ లక్ష్మి కింద ?1,00,000 రూపాయలతో పాటు తులం బంగారం, యువ వికాసం పేరిట విద్యార్థులకు ఇస్తామన్న 5 లక్షల విద్య భరోసా కార్డులు ఇవ్వాలని పాపయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంవిద్యుత్ సవరణ బిల్లును తీసుకువస్తుందని దీనివల్ల రైతులు కరెంటు ఉచితంగా అందే బదులు బోరు బావుల వద్ద మీటర్లు పెట్టి రైతు వద్ద ముక్కు పిండి చార్జీలు వసూలు చేసే ప్రయత్నం చేస్తుందని తెలిపార. సమావేశంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, న్యూ డెమోక్రసీ డిచ్పల్లి మండల కార్యదర్శి జెపి గంగాధర్, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి సుప్రియ, సాయినాథ్, గంగాదాస్ తదితరులు పాల్గొన్నారు.

7న ఛలో హైదరాబాద్

- కరపత్రాలు, గోడ ప్రతులు ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫిబ్రవరి 7న నిర్వహించే చలో హైదరాబాద్ కరపత్రాలను గోడప్రతులను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పూలాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వేల గొంతులు లక్షల డప్పుల గోడ ప్రతులు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ, ప్రముఖ కవి రచయిత మచ్చ దేవేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7 నాడు జరిగే వేల గొంతులు లక్షల డప్పులు మహా ప్రదర్శనను నిజామాబాద్ జిల్లా నుంచి వేలాదిగా డప్పులతో బయల్దేరి విజయవంతం చెయ్యాలని పిలుపునివ్వడం జరిగింది. ప్రతి గ్రామానికి, ప్రతి మాదిగ ఇంటికి కరపత్రం చేరేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, ఎం ఈ ఎఫ్ జాతీయ నాయకులు తెడ్డు గంగారాం, ఎం ఈ ఎఫ్ జిల్లా కన్వీనర్ మారుతి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం రాజేష్ మాదిగ, లసింగరి భూమయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు రోడ్డ ప్రవీణ్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకులు యమున, సత్తేక, సుధ, ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ టౌన్ అధ్యక్షులు మహేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శ్యాంమాదిగ, మండలాల అధ్యక్షులు, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ శాఖలో జనవరి 31న పదవి విరమణ చేసిన సిబ్బందికి ఘనంగా వీడ్కోలు పలికారు. గా ఉన్నాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎస్ .సత్యప్రసాద్, ఇన్ స్పెక్టర్, ఎన్ఐబి-నిజామాబాద్‌న పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శాలువలతో సత్కరించి సర్టిఫికెట్, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) జి.బస్వారెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఎంతో పనిత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్స్ పెక్టర్స్ తిరుపతి, షకీల్ పాష, వారికుటుంబ సభ్యులు పాల్గొన్నార.

క్రీడాకారులకు బహుమతులు అందజేత

- ముగిసిన పోటీలు

నవతెలంగాణ-ముప్కాల్

ప్రముఖ పారిశ్రామిక వేత్త, చిట్టాపూర్ వాస్తవ్యులు ఏనుగు దయనంద్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని మండల కేంద్రంలోని భూదేవ్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా కొనసాగుతున్న కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు శుక్రవారం రోజుతో ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు నగదు పురస్కారంతోపాటు బహుమతులను అందజేశారు. కబడ్డీ బాలుర ప్రథమ సిర్పపల్లి, ద్వితీయ చందర్, ఖోఖో బాలుర ప్రథమ స్థానంలో సంయుక్తంగా పోచంపాడ్, చందర్ జట్లు నిలిచాయి. తృతీయ ఎంజెపి ఇందూర్, వాలీబాల్ బాలుర ప్రథమ మగ్గిడి, ద్వితీయ పడకల్, బాలికల విభాగంలో మగ్గిడి ప్రథమ, కలిగోట్ ద్వితీయ, జక్రాన్ పల్లి తృతీయ స్థానంలో నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో ఎస్ఐ వి.రజినీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు సిద్ధ రమేష్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు అంజయ్య, గోపీనాథ్, ముస్కు మోహన్, టి.సాయన్న, బద్దం హన్మండ్లు, నాయకుడు సంతోష్, బద్దం నర్సారెడ్డి, శ్రవణ్, వ్యాయమ ఉపాధ్యాయులు రాజ్ కుమార్, ప్రసాద్, పవన్, రవీందర్, నరేందర్, మధు, భూపతి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపరిరక్షణ సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, చైతన్య యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్కాట్ బెటర్ సంస్థలో 70 మందికి ఉద్యోగాలు

- కాల్ లెటర్లు అందజేసిన టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



వేగంగా అభివృద్ధి చెందుతున్న అమెరికన్ ఇండియన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ అయిన స్కాట్‌బెటర్, తెలంగాణ ప్రభుత్వం ఐటిఇమరియ సి విభాగం, తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) తో కలిసి పనిచేసే ఆర్టిఫిషియల్ రంగంలో స్థానిక యువతకు నైపుణ్య శిక్షణను అందించడమే కాకుండా, ఉపాధి అవకాశాలను సైతం కల్పించింది. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న స్కాట్ బెటర్ సంస్థ, తెలంగాణలోని నిజామాబాద్ నగరంలోని ఐటి హబ్ కేంద్రంలో తన రెండో శాఖని ఏర్పాటు చేసింది. ప్రపంచంలో ప్రస్తుతమున్న ఏఐ విశిష్టతను తెలియజేస్తూ నైపుణ్య శిక్షణను అందించడమే కాకుండా, శిక్షణ పూర్తి చేసుకున్న 70 మంది యువతీయువకులను తమ కంపెనీకి ఎంపిక చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం నిజామాబాద్ నగరంలోని ఐటీ హబ్‌లో ఉద్యోగాలు సాధించిన 30 మందికి టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా కాల్ లెటర్లు అందజేశారు. అనంతరం సీఈఓ సిన్హా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా రానున్న రోజుల్లో నడిచేది ఏఐ రంగమేనన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు యువతలో ఏఐ నైపుణ్యాన్ని పెంపొందించడానికి బోదపడ తాయన్నారు.

కంపెనీని స్థాపించడమే కాకుండా, స్థానిక యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పించడం పట్ల కంపెనీ ప్రతినిధులైన రక్షిత్, రాఘవ్‌ను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో టాస్క్ ప్రతినిధులు శ్రీనాథ్ రెడ్డి, రఘు తేజ, హన్మంత్, స్కాట్ బెటర్ సీనియర్ టీం లీడర్ ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

దోతి, మల్లాపూర్, మారేపల్లి గ్రామలకు

ఎంపిటిసి స్థానాన్ని ఏర్పాటు చేయాలి

- మూడు గ్రామాల ప్రజలు ఎంపీడీవోకు వినతి

నవతెలంగాణ-మద్నూర్

కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం డోంగ్లి మండలాన్ని మండల పరిషత్‌గా ఏర్పాటు చేసింది. మద్నూర్ ఉమ్మడి మండలం లోని ఎంపీటీసీ స్థానాలను విడదీసి కొత్త మండలమైన డోంగ్లికి ఐదు ఎంపిటిసి స్థానాలు కేటాయించింది. డోంగ్లి మండలంలో గల ధోతి, మల్లాపూర్, మారేపల్లి, ఈ మూడు గ్రామాలకు గతంలో మద్నూర్ మండలంలోని సుల్తాన్‌పేట్ ఎంపీటీసీ పరిధిలో ఉండగా ప్రస్తుతం డోంగ్లి మండలంలోని మోగా ఎంపిటిసి పరిధిలోకి మార్చారు. మోగా ఎంపిటిసి స్థానంలో ఓట్ల సంఖ్య 5000పైగా దాటాయని ఈ గ్రామంతో మాకు దూర ప్రాంతమే కాకుండా ప్రత్యేకంగా మా మూడు గ్రామాలను కలిపి ఒక ప్రత్యేక ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మూడు గ్రామాలకు చెందిన ఆల్ పార్టీల నాయకులు, గ్రామస్తులు ఆయా గ్రామాల పెద్దలు, మాజీ సర్పంచులు ఉమ్మడి మండల ఎంపీడీవో రాణికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తూ విజ్ఞప్తి చేశారు. ఈ మూడు గ్రామాల్లో ఒక గ్రామాన్ని ఎంపీటీసీ స్థానంగా కేటాయించి ప్రత్యేక ఎంపీటీసీ ఏర్పాటు చేయాలని ఎంపీడీవోకు అందజేసిన ఫిర్యాదు కాపీలో విజ్ఞప్తి చేశారు. మీ డిమాండ్‌ను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని ఎంపీడీవో హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

రహదారి భద్రత మాసోత్సవ ముగింపు సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రహదారి మాసోత్సవాల అవగహన సదస్సులు దిగ్విజయంగా నిర్వహించినట్టు జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలను, క్విజ్, డిబేట్, ముగ్గుల పోటీ విజేతలను, రోడ్ భద్రత మాసోత్సవాలలో అత్యుతమ ప్రదర్శన చేసిన పోలీస్ కళాబృందం సభ్యులను, రవాణా శాఖ సిబ్బందిని ప్రశంసాపత్రాలు, హెల్మెట్ ద్వారా సత్కరించారు. మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస్ ప్రసంగిస్తూ రహదారి భద్రత ముగింపు సమావేశాలు సజావుగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ భక్త మార్కండేయ ఆలయం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని పద్మశాలి గల్లీలో గల శ్రీ భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు ఫిబ్రవరి 1న జరగనున్నాయి. ఈ జయంతి ఉత్సవాల కోసం మార్కండేయ మందిర కమిటీ సభ్యులు అన్ని అంగుళాలతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1న నిర్వహించే శ్రీ భక్త మార్కండేయ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేయడమే కాకుండా జయంతి రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో రక్తం మరకలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో శుక్రవారం హరిజనవాడ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో రక్తం మరకలు కనిపించడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వ్యక్తికి గురువారం రాత్రి తీవ్ర గాయాలు కావడంతో పాఠశాలలోనే నిద్రించినట్లు ఉదయం తిరిగి ఇంటికి వెళ్లి పోయినట్లు తెలిపారు. ఉదయం సమయంలో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు రక్తం మరకలు చూసి ఉపాధ్యాయులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. తీరా గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలైన కారణంగా పాఠశాలలో పడుకున్నట్లు గుర్తించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఒక్కసారిగా రక్తం మరకలు కనబడడంతో పాఠశాలలో ఏదైనా హత్య జరిగిందా లేదా దేనినైనా జంతువులను చంపేశారా అన్న అనుమానంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు.

ఘనంగా వాసవీమాత ఆత్మర్పణ దినోత్సవం



వాసవీమాత చిత్రపటానికి పూలమలవేసిన పలువురు

నవతెలంగాణ-పిట్లం/పొతంగల్

మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాత చిత్రపటానికి ఆర్యవైశ్యులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు గంగా ప్రవీణ్, ఉపాధ్యక్షులు రెడ్డి, శెట్టి ప్రసాద్, కోశాధికారి ఉప్పు విట్టల్, బెజం చంద్రశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలు, ప్రేమల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పొతంగల్ : మండల కేంద్రంలోని రాజేశ్వరి మందిరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కంచర్ల గ్రామంలో నీటి సమస్యతో బాధపడుతున్న గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించి పంచాయతీ కార్యదర్శి స్వప్న శుక్రవారం నీటి సమస్యను పరిష్కరించారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామంలో ఫ్లెక్సీలను, శిలాఫలకాలను మూసివేయించారు. గ్రామ ప్రజలు గ్రామంలోని సమస్యలను గ్రామపంచాయతీలో తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు.

కిరణ్ స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలను నిర్మిద్దాం

- పీవైఎల్

నవతెలంగాణ-నిజామాబాద్ సీటీ

యువజన ఉద్యమ కిరణం, ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్)తొలి కన్వీనర్, కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ 34 వర్ధంతిని నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో కూరగాయల హమాలీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు), ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) నగర కమిటీల ఆధ్వర్యంలో ముందుగా కామ్రేడ్ కిరణ్ అన్న చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక(హెచ్‌ఆర్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ.. కామ్రేడ్ కిరణ్ నిజామాబాద్ జిల్లాలో బలమైన యువజన ఉద్యమాన్ని నిర్మించారని, ఆయన స్థాపించిన పివైఎల్ అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. గుట్కా వ్యతిరేక పోరాటాన్ని నిజామాబాద్‌లో ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి గుట్కా నిషేధానికి దోహద పడిందని అన్నారు. కార్మికుల పొట్ట కొట్టే నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కిరణ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ శివకుమార్ మాట్లాడారు. కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ స్ఫూర్తితో బలమైన యువజన కార్మిక ఉద్యమాలు నిర్మించడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. ఐఎఫ్‌టీయు నగర కార్యదర్శి ఎం శివకుమార్, హమాలి నాయకులు మోహన్, రైస్ వకీల్, పివైఎల్ యువజన సంఘం నాయకులు రాజు మల్లేష్ సురేష్ శ్రీనివాస్ గంగాధర్ వీరయ్య ఇమ్రాన్ వసీం విజయ్ అన్వర్ పాల్గొన్నారు.

ప్రగతిశీల యువజన సంఘం తొలి కన్వీనర్ కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ 34వ వర్ధంతి సభ నిజామాబాద్ నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వేములపల్లి కిరణ్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జన్నారపు రాజేశ్వర్ దేవిక రాజు, ఏం. శివకుమార్ మోహన్ శంకర్ జి.రమేష్, పాసికంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని బోర్గాం (కె) గ్రామంలో కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ వర్ధంతి సభను ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయి రెడ్డి మాట్లాడారు. సభలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డి.బన్సీ, మండల కార్యదర్శి శీరం శంకర్, రాపని గంగాధర్, రమేష్, భూమన్న , బుచ్చన్న , తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ : కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ స్ఫూర్తితో యువతకు ఉపాధి అవకాశాలకై నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ కొరకు ఉద్యమించాలని అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలం అయ్యారని కిరణ్ వర్ధంతి సభలో వక్తలు విమర్శించారు. ప్రగతిశీల యువజన సంఘం తొలి కన్వీనర్ కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ 34వ వర్ధంతి సభ మోపాల్ మండల కేంద్రంలో ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కట్లే రజినీకాంత్, అగ్గు చిన్నయ్య, అగ్గు ఎర్రన్న బావురు సాయిలు, బాబా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

15 మందికి ఒకేషనల్ అవార్డ్స్ ప్రధానం

నవతెలంగాణ-ఆర్మూర్

వివిధ రంగాల్లో అంకితభావంతో పనిచేసే వారికి రోటరీ వొకేషనల్ అవార్డు ను పట్టణంలోని పెర్కిట్ కాంతి హైస్కూల్ లో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసిపి వెంకటేశ్వర రెడ్డి హాజరై మాట్లాడుతూ వివిధ రంగాల్లోని ప్రభుత్వ ఉద్యోగులను సన్మానించడం గొప్ప విషయం అని కొనియాడారు. అధ్యక్షులు రజనీష్ కిరాడ్ మాట్లాడుతూ తమ తమ వృత్తిలో అంకితభావంతో పనిచేసే వారికి ఇలాంటి ప్రోత్సాహాన్ని అందిస్తే సమాజం పట్ల నిరంతరం సేవ చేసే బాధ్యత పెరుగుతుందని తెలిపార. ప్రాజెక్ట్ చైర్మన్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ మాట్లాడుతూ ఈ అవార్డు గ్రహించినందుకు తోటి వారు ఆదర్శంగా తీసుకొని అంకితభావంతో పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో కాంతి గంగారెడ్డి, పుష్పాకర్ రావు, చరణ్ రెడ్డి, గోపి పట్వార్, లక్ష్మీనారాయణ, ఖాన్దేశ్ సత్యం, జిట్టా మారుతి, బొడ్డు వినాయక్ పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు

నవతెలంగాణ - భీంగల్ రూరల్

మండలంలోని కుప్కల్ గ్రామ శివారులో పేకాట అడుతునారని సమాచారం రాగ ఎస్సై మహేష్ పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లారు. అక్కడ నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకని వారి దగ్గర నుండి 3080 నగదు స్వాదినం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.